క్లుప్తంగా

గాంధీ విగ్రహం ధ్వంసం


ప్రాథమిక పాఠశాలలోని గాంధీ విగ్రహం

అక్కన్నపేట(హుస్నాబాద్): దేశ స్వాతంత్య్రం కోసం అహింసా మార్గంలో పోరాడిన మహనీయుడు మహాత్మా గాంధీ విగ్రహానికి అవమానం జరిగింది. అక్కన్నపేట మండలం మంచినీళ్లబండ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పాక్షికంగా ధ్వంసం చేశారు. ముఖం గుర్తు పట్టలేని విధంగా ఉంది. బుధవారం ఉదయం విగ్రహాన్ని చూసిన ఉపాధ్యాయులు, విద్యార్థులు విచారం వ్యక్తం చేశారు. గాంధీ విగ్రహం ధ్వంసం కావడంపై గ్రామస్తులు మండిపడ్డారు.

సస్యరక్షణ చేపట్టాలి


సిద్దన్నపేటలో వరి పొలాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

నంగునూరు(సిద్దిపేట): మొగి పురుగు ఆశించినట్లు గుర్తిస్తే సస్యరక్షణ చేపట్టాలని తోర్నాల పరిశోధనాస్థానం శాస్త్రవేత్త డాక్టర్ పల్లవి రైతులకు సూచించారు. బుధవారం అంక్షాపూర్, నంగునూరు, ఖానాపూర్, సిద్దన్నపేట, నాగరాజుపల్లి గ్రామాల్లో వరి పొలాలను పరిశీలించి మొగి పురుగు సోకినట్లు గుర్తించి పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఓ గీత, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ


చంద్లాపూర్‌లో గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

చిన్నకోడూరు(సిద్దిపేట): బీఆర్ఎస్ పాలనలోనే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాయని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. బుధవారం మండల పరిధిలోని చంద్లాపూర్‌లో మహాత్మాగాంధీ విగ్రహావిష్కరణ చేశారు. అలాగే ఏఎస్ఎం సబ్‌సెంటర్, పద్మశాలి, శాలివాహన సంఘం, పాఠశాలలో డైనింగ్ హాల్ భవనాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో ప్రతీ కుటుంబానికి లబ్ధి చేకూరిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, సర్పంచ్ చంద్రకళ, ఎంపీటీసీ దుర్గారెడ్డి, సొసైటీ చైర్మన్ కనకరాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కామిని శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న కారు


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

గజ్వేల్‌రూరల్: లారీని కారు ఢీకొన్న ఘటనలో ఓ వైద్యుడు గాయపడిన సంఘటన బుధవారం గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ ఔటర్ రింగురోడ్డుపై జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్‌కు చెందిన డాక్టర్ శివకుమార్ కారులో హైదరాబాద్ వెళ్తున్నాడు. ఈ క్రమంలో ప్రజ్ఞాపూర్ హైవే ఔటర్ రింగురోడ్డులో ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స చేశారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్ తరలించారు.

వరిసాగులో జాగ్రత్తలు తీసుకోవాలి

గజ్వేల్ ఏడీఏ బాబూ నాయక్

రాయపోలు(దుబ్బాక): యాసంగి వరి పంటలో కాండం తొలిచే పురుగు ఉధృతి ఎక్కువైందని, దీన్ని అరికట్టేందుకు రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని గజ్వేల్ ఏడీఏ బాబూ నాయక్ అన్నారు. రాయపోలు మండలం అంకిరెడ్డిపల్లి, రాంసాగర్ తదితర గ్రామాలలో బుధవారం పర్యటించి వరి పొలాలను పరిశీలించారు. పలు చేలలో కాండం తొలిచే పురుగు ఆశించినట్లు గుర్తించి సస్యరక్షణ చర్యలు వివరించారు. ఆయన వెంట ఇన్‌చార్జి వ్యవసాయాధికారి నాగరాజు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పడకంటి శ్రీనివాస్, రైతులు ఉన్నారు.

సర్పంచ్‌ల సేవలు మరువలేనివి

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి


రాయపోలులో సర్పంచ్‌లను సన్మానిస్తున్న నాయకులు

దుబ్బాకటౌన్: తెలంగాణ గ్రామీణ అభివృద్ధిలో సర్పంచ్‌లు కీలక పాత్ర పోషించారని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సర్పంచ్‌ల పదవీ కాలం పూర్తికావడంతో వారి వీడ్కోలు సందర్భంగా బుధవారం విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో నూతన పంచాయతీ రాజ్ చట్టానికి రూపకల్పన చేసి గ్రామీణ అభివృద్ధికి పెద్దపీట వేయడం జరిగిందన్నారు. పదవులు ఉన్నా లేకున్నా ప్రజల్లో వారికి ఎప్పుడు గుర్తింపు ఉంటుందన్నారు.

పెండింగ్ బిల్లులు వచ్చేలా చర్యలు తీసుకోండి

రాయపోలు(దుబ్బాక): సొంత నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేశామని, బిల్లులు రాకపోవడంతో ఆర్థికంగా నష్టపోయామని రాయపోలు మండల సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. రాయపోలు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం ఎంపీపీ కల్లూరి అనిత సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసినందున వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. తాము పదవిలో ఉన్న ఐదేళ్లలో సకాలంలో బిల్లులు రాలేదని, అప్పుల పాలైనట్లు చెప్పారు. పెండింగ్ బిల్లులు ఇప్పించేందుకు అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మునయ్య, ఎంపీఓ లక్ష్మీనారాయణ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సర్పంచ్ కృషి అమోఘం

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట గ్రామ అభివృద్ధిలో సర్పంచ్ దీపిక కృషి అమోఘమని దూల్మిట్ట గ్రామస్తులు అన్నారు. బుధవారం వీడ్కోలు సమావేశంలో సర్పంచ్, ఉపసర్పంచ్ పోతరాజు మధు, వార్డు సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజు, మాజీ జెడ్పీటీసీ నాచగోని పద్మ వెంకట్‌గౌడ్, మాజీ సర్పంచ్ నాచగోని పద్మాలక్ష్మీగౌడ్, అంగన్ వాడీ కార్యకర్తలు, మహిళా సంఘల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పదవులు శాశ్వతం కాదు

దుబ్బాకరూరల్: సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన సందర్భంగా దుబ్బాక ఎంపీపీ కార్యాలయంలో బుధవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కొత్త పుష్పలత, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి మాట్లాడారు. పదవులు శాశ్వతం కాదని, పదవిలో ఉండగా చేసిన పనులే శాశ్వతంగా నిలిచిపోతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కరశర్మ, ఏఎంసీ చైర్మన్ జ్యోతికృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ కైలాష్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రాజిరెడ్డి, వైస్ ఎంపీపీ అస్క రవి తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయి

కొండపాక(గజ్వేల్): రాజకీయ పదవులు నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని దుద్దెడలో సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఆరెపల్లి మహదేవ్‌గౌడ్ ఆధ్వర్యంలో పంచాయితీ పాలక వర్గం సభ్యులకు బుధవారం ఆత్మీయ అభినందన సన్మాన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గుండెల్లి అంజనేయులు, ఉపసర్పంచ్ గుండెల్లి ఆంజనేయులు, వార్డు సభ్యులు మిద్దె సురేష్, కాట రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల వీడ్కోలు సమావేశం

కొమురవెల్లి(సిద్దిపేట): సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన సందర్భంగా బుధవారం మండలంలోని సర్పంచ్‌లకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ కీర్తన మాట్లాడుతూ సర్పంచ్‌లు చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సిద్దప్ప, ఎంపీడీఓ అనురాధ, ఎంపీఓ మంజుల, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల అలక్ష్యంపై ఆగ్రహం

- మినిట్స్ బుక్‌పై రగడ
- సమాచారం లేకుండానే ఎజెండానా..?
- ఆ బాధ్యత కాంట్రాక్టు కంపెనీదే..
- శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను బదిలీ చేయాలి
- వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ మంజుల

సిద్దిపేటజోన్: సిద్దిపేట బల్దియా సమావేశం వాడీవేడిగా జరిగింది. అధికారుల అలక్ష్యంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల అధ్యక్షత జరిగిన సమావేశంలో పలు అంశాలపై కౌన్సిల్ సభ్యులు అధికారులను నిలదీశారు. గత కౌన్సిల్ సమావేశం ఎజెండాలో అభ్యంతరం తెలిపిన అంశాలను తిరిగి పొందుపర్చడంపై సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానంగా డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో లీకేజీల మరమ్మతుల కోసం రూ 3.08 కోట్ల మున్సిపల్ నిధుల కేటాయింపు, ప్రతిపాదనలకు అభ్యంతరం తెలిపారు. గతంలో ఇళ్లు నిర్మించిన కాంట్రాక్ట్ కంపెనీదే బాధ్యత అని, మున్సిపల్ నిధుల కేటాయింపు వద్దన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణంలో స్థలం కోల్పోయిన బాధితుడికి పరిహారం కేటాయింపుపై కూడా పలువురు సభ్యులు అభ్యంతరం తెలిపారు. పారిశుద్ధ్య విభాగం శానిటరీ ఇన్‌స్పెక్టర్ వనిత ప్రజా ప్రతినిధులకు కనీస గౌరవం ఇవ్వడం లేదని, వెంటనే ఆమెను బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. కౌన్సిల్ సమావేశం ఎజెండా అంశాల్లో సభ్యులకు సమాచారం లేకుండా కొన్ని అంశాలను చేర్చడం ఏమిటని నిలదీశారు. గత కౌన్సిల్ సమావేశంలో చర్చించిన అంశాలు మినిట్స్ బుక్‌లో పొందుపరచడంలేదని అధికారుల తీరుపై మండిపడ్డారు. 41 వార్డులో పర్మిట్ రూమ్‌తో ఇబ్బందులు ఉన్నాయని, 7వ వార్డులో అంగన్‌వాడీ భవనం, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని, రోడ్లు వేయాలని, 5వ వార్డులో నీటి సమస్య పరిష్కారానికి పైప్‌లైన్ నిర్మాణం చేయాల్సిన అవసరం ఉందని సభ్యులు కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. కాగా, పాలకవర్గం, అధికార యంత్రాంగం సమన్వయంతో సమష్టిగా పనిచేసి ఆదర్శ మున్సిపాలిటీ దిశగా అడుగులు వేద్దామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల అన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, కమిషనర్ సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మనిషి జీవితాన్ని మార్చేది చదువు



రామునిపట్లలో డిజిటల్ కంటెంట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఈఓ దేశిరెడ్డి

చిన్నకోడూరు(సిద్దిపేట): మనిషి జీవితాన్ని మార్చేది చదువు ఒక్కటేనని ఎంఈఓ దేశిరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని రామునిపట్ల, మేడిపల్లి, చౌడారం ఇబ్రహీంనగర్ ఉన్నత పాఠశాలల్లో ఎమ్మెల్యే హరీష్‌రావు సౌజన్యంతో పదో తరగతి విద్యార్థులకు డిజిటల్ కంటెంట్ బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఎమ్మెల్యే హరీష్‌రావు సౌజన్యంతో పంపిణీ చేస్తున్న డిజిటల్ కంటెంట్ పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు అన్నారు. బుధవారం పట్టణంలోని పొరుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు డిజిటల్ కంటెంట్ పుస్తకాలను పంపిణీ చేశారు.

ఇసుక దందా పట్టించుకోరా?

సివిల్ రైట్స్‌డేలో నిలదీసిన గ్రామస్తులు


సివిల్ రైట్స్ డేకు హాజరైన అధికారులు

హుస్నాబాద్ రూరల్: ఇసుకను అక్రమంగా తరలించుకుపోతుంటే పోలీసులు, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం తోటపల్లి గ్రామంలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా చట్టాలపై అధికారులు అవగాహన కల్పిస్తున్న క్రమంలో గ్రామస్తులు కలుగజేసుకొని తమ ఊరు కోనేటి వాగు నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తుంటే అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఇసుక రవాణాకు రెవెన్యూ అధికారులు, పోలీసులు మామూళ్లు తీసుకొని కొందరికి అనుమతులు ఇచ్చినట్లు ట్రాక్టర్ యాజమానులు చెబుతున్నారని ఆరోపించారు. గ్రామ సర్పంచ్ మాట కూడా వినటం లేదని, పోలీసుల సహకారంతోనే ఇసుక దందా నడుస్తుందన్నారు. ఇసుక రవాణాపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని, వస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పినా వినిపించుకోలేదు. హుస్నాబాద్‌కు ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు.

కులాల పేరుతో దూషిస్తే చర్యలు

మద్దూరు(హుస్నాబాద్): గ్రామంలో కులాల పేరుతో దూషిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ షేక్ యూనుస్ అహ్మద్ అలీ తెలిపారు. బుధవారం మండలంలోని రేబర్తి గ్రామంలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రజలందరూ కలిసిమెలిసి ఉండాలన్నారు. పౌరహక్కులకు భంగం వాటిల్లితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించా రు. అనంతరం సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలు, సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గోపాల్, ఆర్ఐ రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..

నంగునూరు(సిద్దిపేట): రాజగోపాల్‌పేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులు పాఠాలు బోధించారు. హెచ్ఎంగా రంగు స్పందన, ఎంఈఓగా సౌజన్య, డీఈఓ భార్గవి, డిప్యూటీ ఈఓగా స్వాతి, వర్ష, బ్రహ్మచారి వ్యవహరించారు. విద్యార్థులను హెచ్ఎం కనకయ్య, ఉపాధ్యాయులు మురళీకృష్ణ, తిరుపతి, శ్రీనివాస్‌రెడ్డి, మధుకర్, నర్సయ్య, లలిత, ప్రశాంత్ అభినందించారు.

గణిత భయం అధిగమిస్తే అద్భుతాలు: ట్రెస్మా

సిద్దిపేటజోన్: విద్యార్థుల్లో అత్యధికంగా గణితం అంటే భయం ఉంటుందని, దాన్ని అధిగమిస్తే అద్భుతాలు సాధిస్తారని ట్రెస్మా జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మోహన్ రాజ్ అన్నారు. బుధవారం టీటీసీ భవన్ లో జిల్లాస్థాయి అబాకస్ పోటీలు నిర్వహించారు. సుమారు 15 పాఠశాలల నుంచి 150 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అబాకస్ సాధనతో పిల్లల్లో సృజనాత్మకత, జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు


ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

మర్కూక్(గజ్వేల్): మండల కేంద్రమైన మర్కూక్‌లో ఏడాది క్రితం గుర్తు తెలియని దుండగులు పొలాల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్, వైర్లను ఎత్తుకెళ్లారు. అప్పటి నుంచి బోర్లు పనిచేయక రైతులు నీటి తడులు అందించేందుకు ఇబ్బందిపడుతున్నారు. మంగళవారం సాక్షిలో ‘ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి’ అనే కథనం ప్రచురితమైంది. కథనానికి విద్యుత్ ఏఈ సుధీర్ బుధవారం స్పందించారు. వెంటనే అధికారులతో మాట్లాడి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. రైతులు సాక్షికి ధన్యవాదాలు తెలిపారు.

ఇదేం బాదుడుపై విచారణ

గ్యాస్ ఏజెన్సీకి మెమో జారీ

సాక్షి ఎఫెక్ట్

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ వాయుపుత్ర గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు వినియోగదారుల నుంచి మానిటరింగ్ పేరుతో కనెక్షన్‌కు రూ.240లు వసూలు చేసే అక్రమ దందాను సాక్షిలో ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. మంగళవారం, బుధవారం వినియోగదారులను విచారించి గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులకు మెమో జారీ చేసినట్లు జిల్లా సివిల్ సప్లయ్ అధికారిణి తనుషా బుధవారం తెలిపారు. అక్రమ వసూలు చేసిన వారి నుంచి వివరణ తీసుకొని వినియోగదారుల ఫిర్యాదుతో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఐదేళ్లకు ఒకసారి వసూలు చేయాలని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మద్యం సేవించి వాహనాలు నడపొద్దని జిల్లా రవాణా శాఖ ఇన్‌చార్జి అధికారి లక్ష్మణ్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లా కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు తగ్గుతాయన్నారు.

కరెంట్ కోతలపై సభ్యుల కన్నెర్ర

తొగుట మండల సమావేశం


మాట్లాడుతున్న ఎంపీపీ లత

తొగుట(దుబ్బాక): యాసంగిలో కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని ప్రజా ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఎంపీపీ లత అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. విద్యుత్ ఏఈ శ్రీనివాస్ నివేదిక చదువుతుండగా తుక్కాపూర్ సర్పంచ్ చంద్రం జోక్యంచేసుకుని వేసవి రానేలేదు అప్పుడే కోతలు విధిస్తున్నారంటూ ఆందోళన వ్యక్తంచేశారు. సమయపాలన పాటించకుండా కోతలు విధించడంతో పంటలు ఎండిపోయే దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తంచేశారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే రైతులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో మూత్రశాలలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని వెంకట్రావుపేట ఎంపీటీసీ నర్సింహులు సభలో ప్రస్తావించారు. అధికారులు నిర్లక్ష్యం కారణంగా మధ్యాహ్న భోజనశాలలు అసంపూర్తిగా నిలిచిపోయాయన్నారు. ఎంపీపీ జోక్యంచేసుకుని సమస్యలను జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకుపోయి పరిష్కారానికి కృషిచేస్తామని హామీనిచ్చారు. అనంతరం మండలంలోని సర్పంచ్‌లకు సన్మానించారు. సమావేశంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, పీఏసీఎస్, ఏఎంసీ చైర్మన్లు హరికృష్ణారెడ్డి, కొమురయ్య, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో శ్రీధర్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

గద్దర్‌కు ఘన నివాళి


హుస్నాబాద్‌లో నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

హుస్నాబాద్: ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన హుస్నాబాద్ అమర వీరుల స్తూపాన్ని ప్రభుత్వం మళ్లీ నిర్మించాలని పలువురు వక్తలు కోరారు. హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం ప్రజాయుద్ధ నౌక గద్దర్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. గద్దర్ నిరంతరం పేద ప్రజల అభివృద్ధి కోసం ఆరాట పడ్డారని తెలిపారు. తన పాటను తూటాగా మలచి పాలకులను ప్రశ్నించాడన్నారు. అమరుల స్తూపం వద్ద గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. గద్దర్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో టీ పీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, జేఏసీ కో కన్వీనర్ కొయ్యడ కొమురయ్య, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రజాయుద్ధనౌక గద్దర్ జయంతిని జగదేవ్‌పూర్‌లో అంబేద్కర్ చౌరస్తాలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాలమహానాడు మండల అధ్యక్షుడు శివలింగం మాట్లాడుతూ మెదక్ జిల్లాకు గద్దర్ పేరు పెట్టాలని, ట్యాంక్‌బండ్‌పై క్యాంస విగ్రహం ఏర్పాటుచేయాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ రాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటకమాన్: గద్దర్ జయంతిని ప్రజాసంఘాల నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

గద్దర్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలి

గజ్వేల్‌రూరల్: ప్రజాయుద్ధనౌక గద్దర్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని దళిత, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద గద్దర్ జయంతి సందర్భంగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి

చేర్యాల(సిద్దిపేట): ఖమ్మంలో ఫిబ్రవరి 11, 12వ తేదీల్లో జరిగే టీపీటీఎఫ్ ద్వితీయ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు కొమాండ్ల రాంరెడ్డి కోరారు. బుధవారం బాలుర ఉన్నత పాఠశాలలో మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిలిచిన బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలన్నారు. మూడు డీఏలు విడుదల చేస్తూ పీఆర్సీని వెంటనే ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు నిమ్మ బాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ దాతల సహకారం గొప్పది

కొండపాక(గజ్వేల్): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు అందిస్తున్న సహకారం గొప్పదని హెచ్ఎం పెద్ది విఠల్ అన్నారు. మండల పరిధిలోని సిర్సనగండ్ల హైస్కూల్లో బుధవారం క్రియేటివ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాజుల శ్రీనివాస్ జ్ఞాపకార్థం విద్యార్థులకు పరీక్షల మెటీరియల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెద్ది విఠల్ మాట్లాడుతూ క్రియేటివ్ టీచర్స్ అసోసియేషన్ గత 15 ఏళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్‌ను అందిస్తోందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు లింగ శ్రీనివాస్, సభ్యులు దయానంద సరస్వతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

◆ డ్రైనేజీ పనులు ప్రారంభం

చేర్యాల(సిద్దిపేట): పట్టణ పరిధిలోని 11వ వార్డు జండా గల్లీలో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను బుధవారం కౌన్సిలర్ ముస్త్యాల తార యాదగిరితో కలిసి మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూపరాణి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్ రెడ్డి, కౌన్సిలర్లు ఉడుముల ఇన్నమ్మ భాస్కర్‌రెడ్డి, తుమ్మలపల్లి లీలసంజీవులు, ఆడెపు నరేందర్, సురేష్, మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

◆ ఓపెన్ జిమ్ ఏర్పాటుకు భూమిపూజ

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న ఓపెన్ జిమ్‌కు బుధవారం ఎంపీపీ మాలోతు లక్ష్మీ, గ్రామ సర్పంచ్ ముత్యాల సంజీవ్‌రెడ్డి, ఎంపీడీఓ కొప్పుల సత్యపాల్‌రెడ్డి,ఎంపీటీసీ సభ్యుడు పెసరు సాంబరాజు భూమి పూజ చేశారు. నార్లపురం వెంకటయ్య, ఆగవ్వ జ్ఞాపకార్థం కుమారుడు, కోడలు రాజేశం, రాజమణి దంపతులు ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తున్నారు. అలాగే నార్లపురం రామయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు చంద్రమొగిళి, రవీందర్ గ్రామానికి వైకుంఠ రథాన్ని బహూకరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంతారావు పాల్గొన్నారు.

◆ భూ అక్రమాలపై విచారణ జరిపించాలి

హుస్నాబాద్: హుస్నాబాద్‌లో చోటుచేసుకున్న భూ అక్రమాలపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఏసీబీ అధికారులచే విచారణ జరిపించాలని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2009 నుంచి 2023 వరకు ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు కబ్జాకు గురయ్యాయని పేర్కొన్నారు. గతంలో ప్రభుత్వ భూమి ఉన్న చోట ఎవరూ కొనుగోలు చేయరాదని ప్రతిపక్ష నాయకుల ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారన్నారు. ధరణి పోర్టల్ రావడంతో అసైన్డ్ భూములకు సంబంధించి అనుభవదారుల కాలం తీసివేయడంతో వివిధ పార్టీలకు సంబంధించిన నాయకులు భూ అక్రమణ చేశారని ఆరోపించారు.

◆ మల్లన్నను దర్శించుకున్న మెదక్ అడిషనల్ ఎస్పీ



కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామిని మెదక్ అడిషనల్ ఎస్పీ మహేందర్ బుధవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి వారి పూజల అనంతరం ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

వ్యక్తిపై కేసు నమోదు

అక్కన్నపేట(హుస్నాబాద్): చంపుతానని బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదైంది. ఎస్ఐ తాండ్ర వివేక్ తెలిపిన వివరాల ప్రకారం జనగామకు చెందిన ఎగ్గిడి ధనలక్ష్మీ చిన్నబాపు ఎగ్గిడి అయిలయ్య కుటుంబాల మధ్య భూ తగాదాలున్నాయి. ఈ క్రమంలో మంగళవారం రాత్రి అయిలయ్య మద్యం తాగి అనుచిత వ్యాఖ్యలు చేస్తూ దాడికి దిగాడని ధనలక్ష్మీ పోలీసులను ఆశ్రయించింది. అయిలయ్యతో తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని బాధితురాలు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మోదీ ప్రభంజనాన్ని ఆపలేరు

నంగునూరు(సిద్దిపేట): మోదీ ప్రభంజనాన్ని వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీ ఆపలేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి అన్నారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా బుధవారం నంగునూరులోని నల్ల పోచమ్మ, మహంకాళమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లాలో బీజేపీకి ఆదరణ పెరుగుతోందని, నాయకులు కార్యకర్తలు కలసికట్టుగా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

బెజ్జంకి(సిద్దిపేట): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ అన్నారు. బెజ్జంకి, గూడెం గ్రామాల్లో బుధవారం పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రోడ్ల మరమ్మతుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే కాంట్రాక్టర్లకు రావాల్సిన అభివృద్ధి పనుల బిల్లులు మంజూరు చేయిస్తామని తెలిపారు. ఎమ్మెల్యేను బెజ్జంకి సర్పంచ్ పాలకవర్గం, ఉపాధ్యాయ సంఘం నాయకులు సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ లింగాల నిర్మల, జెడ్పీటీసీ కనగండ్ల కవిత, ఎంపీడీఓ రాము, ఎంపీఓ విష్ణు, ఏఈలు, సర్పంచ్‌లు మంజుల, రాజశ్రీ, ఎంపీటీసీ శారద, నాయకులు పాల్గొన్నారు.